
మంత్రి శివరాజ్ తంగడగి, కన్నయ్యనాయుడు ఆనందం





గేటు ఏర్పాటులో కార్మికులు

- తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ స్థానంలో స్టాప్‌లాగ్
- గేట్ తొలి ఎలిమెంట్ అమరిక విజయవంతం
- అడ్డంకులను అధిగమిస్తూ ఒక్కో అడుగు..
- పదుల సంఖ్యలో నిపుణులు..
- వందకు పైగా కార్మికులు
- ఈ నెల 10న కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్
- కన్నయ్య నాయుడు నేతృత్వంలో నష్ట నివారణ

సంకల్పానికి సలాం..!

తుంగభద్ర జలాశయం నిండుకుండగా మారి.. 105.78 టీఎంసీలు నిల్వ ఉండగా.. అనుకోని విపత్తు ఎదురైంది. క్రస్ట్ గేట్‌ల నుంచి నదిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో.. ఈ నెల 10వ తేదీ రాత్రి సుమారు 10.30 సమయంలో 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. విషయం తెలియగానే లక్షలాది ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రైతాంగంలో ఆందోళన, నైరాశ్యం చోటు చేసుకున్నాయి. కొన్ని గంటల వ్యవధిలో ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మరీ ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. క్రస్ట్‌గేట్‌ల విషయంలో అపార నైపుణ్యం ఉన్న కన్నయ్య నాయుడును రంగంలోకి దించింది. ఆయన సూచనలతో పక్కా ప్రణాళిక సిద్ధమైంది. వారం రోజులపాటు రేయింబవళ్లు వందలాది మంది శ్రమించారు. శుక్రవారం రాత్రి 9.10 సమయానికి అద్భుతం ఆవిష్కృతమైంది. 'మునుముందు తలెత్తే ఇలాంటి విపత్తులకు ఇది ఒక మోడల్ కావాలి..' అని కన్నయ్య నాయుడు ప్రకటించి 24 గంటలు గడవకనే.. ఆ మోడల్ సాకారమైంది. డ్యాం స్పిల్‌వే 1613 అడుగుల వద్దకు తొలి స్టాప్‌లాగ్ ఎలిమెంట్ వెళ్లి దర్జాగా కూర్చుంది. దానిపై మరో నాలుగు స్టాప్‌లాగ్ ఎలిమెంట్లు ఏర్పాటు చేయడానికి పెద్దగా సమయం పట్టకపోవచ్చు. శనివారం సాయంత్రానికి ఈ ప్రక్రియ సంపూర్ణంగా విజయవంతం కావచ్చు. ఈ లెక్కన.. రేపటి నుంచి చుక్క నీరు వృథా కాదు. ఈ పనులు జరుగుతుండగా.. శుక్రవారం ఆకాశం కూడా హర్షం వ్యక్తం చేసింది. అప్పుడప్పుడు వర్షిస్తూ.. 'ఏం భయంలేదు.. ఇంకా వానాకాలం ఉంది. డ్యాం మళ్లీ నిండుతుంది. మీ శ్రమ వృథా కాదు..' అని ఉత్తేజపరిచింది.

50 టీఎంసీలు నదికి..

క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన వారం రోజుల్లో డ్యాం నుంచి తుంగభద్ర నదిలోకి సుమారు 50 టీఎంసీల నీరు వెళ్లింది. డ్యాం క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన రోజు 105.78 టీఎంసీల నిల్వలు ఉండగా.. తొలి ఎలిమెంట్ అమర్చే సమయానికి శుక్రవారం సుమారు 68 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. ఈ లెక్కన డ్యాం నిల్వల నుంచి 37.7 టీఎంసీల నీరు నదికి, కాల్వలకు వెళ్లింది. దీంతోపాటు డ్యాంలోకి గడిచిన వారం రోజులుగా 40 వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వస్తోంది. ఇది సుమారు 15 టీఎంసీల దాకా ఉంటుంది. మొత్తం 53 టీఎంసీల నీరు కాలువలు, నదిలోకి వెళ్లినట్లు. ఇందులో కాలువలకు 3 టీఎంసీలు అనుకున్నా.. నదిలోకి వెళ్లింది సుమారు 50 టీఎంసీలు. క్రస్ట్‌గేట్ కొట్టుకపోయి ఉండకపోతే.. నది, కాలువలకు పైనుంచి వచ్చి చేరుతున్న 15 టీఎంసీల వరద నీరు మాత్రమే వెళ్లేది. స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేయకపోతే డ్యాం నుంచి స్పిల్ వే వరకూ (1613 అడుగులు) ఉన్న నీరు మొత్తం దిగువకు వెళ్లేది. స్పిల్ లెవెల్ వద్ద 43 టీఎంసీల నిల్వలు ఉంటాయి. ప్రస్తుతం డ్యాంలో 68 టీఎంసీలు ఉన్నందున.. నిల్వ నీటిలో 25 టీఎంసీల దాకా నిపుణులు కాపాడినట్లు. దీంతోపాటు.. ఇకపై వచ్చే వరదనీటినీ ఒడిసి పట్టుకున్నట్లు. తీవ్ర ఆందోళనకు గురైన రైతాంగానికి ఇంతకు మించిన శుభవార్త ఇంకేముంటుంది..?

(రాయదుర్గం/బళ్లారి/గాంధీనగర్)



సంబరాలు

గేటు ఏర్పాటు విజయవంతం

ఏపీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం అర్బన్, ఆగస్టు 16: తుంగభద్ర డ్యామ్‌లో 19వ గేట్‌కు సంబంధించిన మొదటి గేట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 19వ గేట్‌కు సంబంధించి మొదటి గేటును విజయవంతంగా దింపిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. టీబీ డ్యామ్‌లో 19వ గేట్ కొట్టుకుపోయిన పరిస్థితుల్లో శుక్రవారం అనుకున్నది అనుకున్న ట్లుగా చాలా విజయవంతంగా గేట్ దింపారన్నారు. శుక్రవారం రాత్రికి రెండు, మూడు, నాలుగు గేట్లను కూడా దింపుతారని వెల్లడించారు. భారతదేశ చరిత్రలో నది నీటి ప్రవాహం ఉన్న తరుణంలో గేటు ఏర్పాటు చేయడం అనేది ఇంజనీరింగ్ అధికారుల సాహసోపేత చర్య అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారన్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో మన కోసం పనిచేసిన కార్మికులు, అధికారులు, కర్ణాటక ప్రభుత్వానికి జిల్లా రైతాంగం తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ రోజు రాత్రి ఎంతసేపైనా 19వ గేట్‌లో మరో రెండు, మూడు గేట్లు ఏర్పాటును పర్యవేక్షిస్తామన్నారు.

అమూల్య జల సంపదను కాపాడిన నిపుణులు



కౌంటర్ వెయిట్‌ను కిందకు దించుతున్న దృశ్యం

అడ్డంకులను అధిగమిస్తూ..!

19వ క్రస్ట్‌గేట్ స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ గేట్‌ను అమర్చేందుకు కన్నయ్యనాయుడు నేతృత్వంలోని నిపుణుల బృందం శుక్రవారం ఉదయం 9 గంటలకు పనులను పునః ప్రారంభించారు. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ స్థానంలో తెగిపోయిన గేట్ ముక్క గైడ్ యాంగిల్ వద్ద అడ్డుగా ఇరుక్కుపోవడంతో దానిని గుర్తించి, మధ్యాహ్నానికి ఒడ్డుకు తీసుకొచ్చారు. తమిళనాడుకు చెందిన జిందాల్ కార్మికులు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి దిగి ఆ ముక్కను క్రేన్ల సాయంతో ఒడ్డుకు చేర్చారు. రెండురోజులుగా అక్కడున్న క్రేన్ల సామర్థ్యం తక్కువగా ఉండడంతో 90 టన్నుల కెపాసిటీ కలిగిన మరో రెండు క్రేన్లను హుటాహుటిన తెప్పించి వినియోగిస్తున్నారు. ఇప్పటికే 60 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తు ఉన్న రెండు గేట్ ఎలిమెంట్‌లను 19వ క్రస్ట్ గేట్ వద్ద ఆనకట్టపై సిద్ధంగా ఉంచారు. వాటిలో ఒక గేట్‌ను దించేందుకు ప్రయత్నించగా క్రేన్లకు ఒక వైపు కౌంటర్ వెయిట్, మరో వైపు హాయిస్ ప్లాట్‌ఫాం ఆటంకం కలిగించాయి. దీంతో కన్నయ్యనాయుడు సూచన మేరకు వాటిని తొలగించారు. హాయిస్ ప్లాట్‌ఫారంను సాయంత్రానికి తీసి ఆనకట్టపై ఓ పక్క ఉంచేశారు. క్రస్ట్‌గేట్‌కు ముందువైపు పై భాగంలో 30 టన్నుల బరువున్న కౌంటర్‌వెయిట్‌ను జాగ్రత్తగా 1633 అడుగుల వరకు కిందకు దించారు. ఇలా.. స్టాప్ లాగ్ గేట్ తొలి ఎలిమెంట్‌ను గైడ్‌యాంగిల్‌లో కూర్చోబెట్టేందుకు పైభాగంలో అడ్డంగా ఉండే ఆ రెండింటిని తొలగించారు. అనంతరం క్రేన్ల సాయంతో ఎలిమేట్‌ను గైడ్‌యాంగిల్‌లో అమర్చేందుకు సాయంత్రం 6 గంటల నుంచి పనులను ప్రారంభించారు. డ్యాం నుంచి క్రస్ట్ గేట్‌ల ద్వారా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వద్ద ఈ ప్రక్రియ సాగింది. అనుకోని ప్రమాదం తలెత్తితే నిపుణులు, కార్మికులను కాపాడేందుకు డ్యాం దిగువన నదిజలాలలో బోర్డు అధికారులు రెండు రెస్క్యూ టీంలను సిద్ధంగా ఉంచారు. ప్లాస్టిక్ పడవలలో ఈ రెండు బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.



పరిశీలిస్తున్న నిపుణులు



చింతామణి తాలూకా ఆలంబగిరి క్షేత్రంపై సామూహిక వ్రతం

రాష్ట్రమంతటా వరలక్ష్మీ వ్రతం

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వరమహాలక్ష్మి వ్రతం సంతోషంగా జరుపుకొన్నారు. శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరమహాలక్ష్మి పూజలు చేసుకునే సంప్రదాయం ఉంది. లక్ష్మీదేవిని వివిధ పూలు, పండ్లు, ఆభరణాలతో అలంకరించి వ్రతం చేస్తారు. ఇంటింటా జరుపుకొనే పండుగ కావడంతో ప్రతి ఇంటా మహిళలు సంప్రదాయ దుస్తులతో పూజల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. తుమకూరు జిల్లా గొరవనహళ్లిలోని లక్ష్మీ ఆలయంతోపాటు బెంగళూరులోని మల్లేశ్వరం లక్ష్మీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. చింతామణి తాలూకాలోని ప్రసిద్ధ ఆలంబగిరి క్షేత్రం కల్కి లక్ష్మీవెంకటరమణ స్వామి దేవస్థానంలో సాయత్రం వరమహాలక్ష్మి సామూహిక వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఉత్తమ నటుడిగా రిషబ్‌శెట్టి

- కేజీఎఫ్-2కు ఉత్తమ చిత్ర పురస్కారం
- శాండల్‌వుడ్‌లో సంబరాలు

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ చలనచిత్ర పురస్కారాలలో శాండల్‌వుడ్‌కు కలిసొచ్చింది. 'కాంతార' సినిమాలో అద్భుతనటనకు రిషబ్‌శెట్టికి ఉత్తమ నటుడిగా పురస్కారం దక్కింది. కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ ఢిల్లీలో శుక్రవారం జాబితాను ప్రకటించింది. శాండల్‌వుడ్‌కు పురస్కారాలు దక్కాయి. ఫీచర్‌ఫిల్మ్ విభాగంలో ఉత్తమ ప్రాంతీయ చిత్రాలపైకి ఉత్తమ కన్నడ సినిమా పురస్కారాన్ని కేజీఎఫ్ చాప్టర్-2కు లభించింది. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తోపాటు ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్‌గా అన్బరివ్ (అన్బుమణి, అరివుమణి సోదరద్వయం)కు వరించింది. కన్నడ సినిమాకు ఉత్తమ నటుడు, దర్శకత్వంతోపాటు పలు పురస్కారాలు దక్కడంపై శాండల్‌వుడ్‌లో సంబరాలు చేసుకుంటున్నారు.



కాంతారలో రిషబ్‌శెట్టి

కేంద్రమంత్రి సోమణ్ణకు రాష్ట్ర ప్రభుత్వం షాక్

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణకు రాష్ట్ర ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. తుమకూరు ఎంపీగా వ్యవహరిస్తున్న సోమణ్ణకు తుమకూరు నగరంలోని పాత అతిథి గృహంలో కార్యాలయం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. ఈనెల 18న ఆదివారం కార్యాలయాన్ని ఆరంభించుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఓవైపు ఫర్నీచర్‌తోపాటు మరమ్మత్తులు కొనసాగిస్తున్నారు. ఎంపీ క్యాంప్ ఆఫీస్ తరహాలో అందుబాటులో ఉంచేందుకు అవసరమైన సౌలభ్యాలు సమకూర్చుకుంటున్నారు. శుక్రవారం ఒక్కసారిగా సదరు భవనాన్ని కేటాయించలేమని రాష్ట్రప్రభుత్వం జిల్లా అధికారికి ఆదేశాలిచ్చింది. దీంతో మరో రెండు రోజుల్లో ఆరంభించదలచుకున్న భవనం ఒక్కసారిగా చేజారినట్టయ్యింది. 4 గదుల మరమ్మత్తులతోపాటు ఫర్నీచర్ కూడా సిద్ధం చేసుకున్న వేళ అధికారుల నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్రమంత్రుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న విమర్శలకు దారితీస్తోంది. ఇటీవలే కేంద్ర మంత్రి కుమారస్వామి నంజనగూడు ఆలయాన్ని దర్శించుకుని అతిథిగృహం వద్దకు వెళ్తే తలుపులు తెరవకుండా ఇబ్బంది కలిగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో కేంద్ర మంత్రి సోమణ్ణ విషయంలోనూ అదే తరహాలో వ్యవహరించారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- జలాశయాల నుంచి చెరువులకు నీరు వదలండి
- వంతెనల నాణ్యతపై నివేదికలు ఇవ్వండి
- జిల్లా అధికారులకు సీఎం సిద్దరామయ్య ఆదేశం



బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య జిల్లా అధికారులు, జిల్లా పంచాయతీ సీఈఓలను ఆదేశించారు. శుక్రవారం అధికారిక నివాసంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సాధారణం కంటే 22 శాతం ఎక్కువ వర్షం కురిసిందన్నారు. చామరాజనగర, మండ్య, తుమకూరులోనూ అధిక వర్షం నమోదయిందని పేర్కొన్నారు. 13 జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు ప్రభావం చూపాయన్నారు. మరో నాలుగువారాలు దక్షిణతీరం, సముద్రతీర ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బీదర్, హుబ్బళ్లిలోని పలు తాలూకాలలో నష్టాలపై సమీక్షించారు. 82 లక్షల హెక్టార్లు సాధారణ సాగు కాగా ఇప్పటి వరకు 70 లక్షల హెక్టార్లలో విత్తన పనులు పూర్తి కావడం సంతోషదాయకమన్నారు. 81,509 హెక్టార్లలో పంట దెబ్బతిందని, తుది నివేదికలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని జలాశయాలు భర్తీ అయ్యాయని, చెరువులకు నీరు మళ్లించే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రాజెక్టుల నుంచి ఒక్కసారిగా భారీగా నీరు విడుదల చేయకుండా ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ ముఖ్యమని సూచించారు. నీటి విషయంలో అన్నిశాఖల సమన్వయం ముఖ్యమని సీఎం తెలిపారు. బ్రిడ్జిల నాణ్యతపై ప్రజాపనులశాఖ నివేదికలు సిద్ధం చేయాలని, ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీట మునిగిన బ్రిడ్జిల ప్రాంతంలో సంచారాన్ని నిలిపివేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలకు అవకాశం ఇవ్వరాదని తెలిపారు. ఇప్పటి వరకు 67మంది మృతి చెందారని, 62 ప్రమాదాలకు రూ. 3.29 కోట్ల పరిహారం సమకూర్చామన్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేయాలని, రూ.20వేల గ్రాంటు కేటాయించాలని ఆదేశించారు. ఇల్లు కూలడం, కొట్టుకుపోవడం వంటి ప్రమాదాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. బెంగళూరులో వర్షం పర్యవేక్షణ కోసం కంట్రోల్‌రూంల ఏర్పాటు పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాజకాలువలు, ఓపెన్‌గా ఉండే కాలువల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బెంగళూరు అధికారులు అప్రమత్తంగా లేకపోతే పెనుప్రమాదమని హెచ్చరించారు. బీడీఏతోపాటు అన్ని సంస్థలు బీబీఎంపీ అనుబంధంగా పనిచేయాలని అన్నారు. అన్నిశాఖలు మరో నెల రోజులపాటు అప్రమత్తంగా ఉంటే మాత్రమే నష్టాలను అధిగమించవచ్చు అన్నారు. వర్షం కారణంగా భారీ నష్టాలు కలగకుండా ఉండాలంటే ముందస్తు చర్యలు కీలకమనేది గుర్తుంచుకోవాలన్నారు.

ప్రాజెక్టుల పరిశీలన కమిటీకి రాకేశ్‌సింగ్ సారథ్యం..?

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాజెక్టుల పనితీరు, గేట్ల రక్షణపై పరిశీలన కోసం రాకేశ్‌సింగ్ సారథ్యంలో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు డీసీఎం, జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి గౌరవ్‌గుప్తకు సూచించినట్టు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లోనే ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. జలవనరులశాఖలో ఎనిమిదేళ్లపాటు అదనపు ముఖ్యకార్యదర్శిగా రాకేశ్‌సింగ్ వ్యవహరించారు. ఇటీవలే ఆయన రిటైర్డ్ అయ్యారు. తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్‌గేట్ తెగిపోవడంతో భారీగా వరద సముద్రం పాలవుతోంది. రాష్ట్రంలోని అన్ని జలాశయాల క్రస్ట్ గేట్ల భద్రతను పరిశీలించాలని డీసీఎం డీకే శివకుమార్ సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జలవనరులశాఖలో అపార అనుభవం కల్గిన ఐఏఎస్ అధికారి రాకేశ్‌సింగ్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుకు సూచించారు. ప్రాజెక్టుల సురక్షిత కమిటీ నెలరోజుల్లో అన్ని ప్రాజెక్టులను సందర్శించి సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. జలవనరుల విభాగంలో కాంట్రాక్టు సిబ్బంది ఎంత మంది ఉన్నారనే అంశాన్ని కూడా పరిగణించాలని సూచించారు. ఈ మేరకు ప్రాజెక్టుల పరిశీలనపై త్వరలోనే సమగ్ర నివేదిక రానుందని తెలుస్తోంది.



మెడికోపై కిరాతక చర్యను నిరసిస్తూ రోడ్డెక్కిన వైద్యులు

- నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఓపీడీ సేవల బంద్‌కు పిలుపు

నిరసనలో మెడికోలకు మద్దతుగా మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మంజునాథ్






ప్లకార్డుతో నిరసనలో మెడికో

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో మెడికోపై కిరాతక చర్యను నిరసిస్తూ శుక్రవారం వైద్యులు రోడ్డెక్కారు. ఇటీవలికాలంలో డాక్టర్లకు రక్షణ లేకుండా పోతోందని మండిపడ్డారు. శనివారం రాష్ట్రమంతటా ఓపీడీ సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఫ్రీడంపార్కులో మెడికల్ విద్యార్థులు పానీపూరి బండి ఉంచి డాక్టర్ల పరిస్థితి దారుణమవుతోందని వినూత్నంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కోల్‌కతాలో మెడికల్ విద్యార్థిని పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన సంఘటన బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ, కార్డియాలజిస్ట్ మంజునాథ్ వారికి మద్దతు పలికారు. మైసూరులో కేఆర్ ఆసుపత్రి ఎదుట నిరసన కొనసాగించారు. ఓపీడీ సేవల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు డాక్టర్ల అసోసియేషన్‌లతో చర్చలు జరిపారు.





పానీపూరి బండితో యువ డాక్టర్ల నిరసన



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.79	1,628.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	33,419	5,160
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	86,310	9,797
సామర్థ్యం (టీఎంసీలు)	72.61	88.25

శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ చాన్సలర్‌గా మునిరాజు



చాన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మునిరాజ్

బళ్లారి సిటీ, ఆగస్టు 16: గవర్నర్ ఆదేశాల మేరకు బెంగళూరు యూనివర్శిటీ వాణిజ్య విభాగానికి చెందిన డాక్టర్ ఎం.మునిరాజు విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ కొత్త చాన్సలర్‌గా నియమితులయ్యారు. ఆయనకు తాత్కాలిక చాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ తిప్పే రుద్రప్ప బాధ్యతలు అప్పగించారు. యూనివర్శిటీ నూతన చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జనస్పందన

బళ్లారి సిటీ, ఆగస్టు 16: అనంతపురం రోడ్డులోని నూతన జిల్లా పాలనా భవనంలో శనివారం ఉదయం జిల్లా స్థాయి జనస్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలియజేశారు. ఈసందర్భంగా బళ్లారి ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్‌కు ప్రభుత్వ పనులపై ప్రజాప్రతినిధులు, ఫిర్యాదులందజేయవచ్చని ఆయన తెలిపారు.

నిర్వాసితుల కేంద్రం సందర్శన



నిర్వాసితుల కేంద్రాన్ని పరిశీలిస్తున్నసంక్షేమ శాఖ అధికారి

బళ్లారి సిటీ, ఆగస్టు 16: సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున కేంద్ర శరణార్థుల సహాయ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. శరణార్థుల సహాయ కేంద్రంలో నివాసితులకు ఇస్తున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. స్నానానికి వేడి నీళ్ల సదుపాయం కల్పించాలని సిబ్బందికి సూచించారు. వారికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామి ఇచ్చారు. శరణార్థుల సహాయ కేంద్రంలో మొత్తం 94మంది పురుష శరణార్థులు, 34మంది మహిళా శరణార్థులు ఉన్నారు. సుమారు 128మంది శరణార్థులకు ఆహారం, ఇతర సౌకర్యాలు కొరతలేకుండా పర్యవేక్షించాలన్నారు. ఏదైనా సమస్య కనిపిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదే సమయంలో శరణార్థుల సహాయ కేంద్రంలోని వృద్ధులకు వస్త్రాలు, బెడ్ పిల్లో కవర్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా అయన వెంట కేంద్రం సూపరింటెండెంట్ ఉన్నారు.

వీరశైవ మహాసభ అధ్యక్షుడికి సత్కారం



శివానందను సత్కరిస్తున్న నగర ప్రముఖులు

బళ్లారి సిటీ, ఆగస్టు 16: అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన దండిన శివానందను బళ్లారి నగర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. గతంలో కూడా అధ్యక్షుడిగా ఉన్న శివానంద ప్రస్తుతం మరలా ఎన్నికయ్యారు. ఆయనను నగరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో కేపీసీసీ మాజీ అధ్యక్షుడు అల్లం వీరభద్రప్ప, మాజీ ఎంపీ కేసి. కొండయ్య, మాజీ బుడా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ముల్లంగి రవీంద్రబాబు, కాంగ్రెస్ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సాహసమే ఊపిరిగా..

● తుంగభద్ర డ్యాం గేట్‌కు స్టాప్‌లాగ్ బిగించడంలో అధికారుల పట్టుదల



డ్యాం పైభాగం నుంచి స్టాప్‌లాగ్‌ను బిగిస్తున్న దృశ్యం

బళ్లారి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం 19వ గేటుకు స్టాప్‌లాగ్ బిగించేందుకు ఇంజనీయర్లు, కార్మికులు ఏమాత్రం విశ్వాసం సన్నగిల్లకుండా సాహసం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి స్టాప్‌లాగ్ బిగించేందుకు అనేక అడ్డంకులు ఎదురయినా ఫస్ట్ ఎలిమెంట్‌ను స్పిల్‌వే మీదకు భద్రంగా చేర్చారు. ఓ పక్క డ్యాం గేట్లద్వారా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొత్తగా తయారు చేసిన స్టాప్‌లాగ్ బిగించేందుకు గోడకు ఉండే ఒక లాక్ అడ్డు వచ్చింది. దాన్ని తొలగిస్తే గేట్లు గోడలు దెబ్బతినిపోతాయి. ఇందుకు ఇంజనీయర్లు కొత్త ఆలోచన చేశారు. స్టాప్‌లాగ్‌ను పైనుండి గేటు గాడిలో అమర్చాలని నిర్ణయించుకున్నారు. గేటుకు ఉండే కౌంటర్ వెయిట్‌ను కిందకు దించేశారు. పైన ఉండే హోస్టుప్లాట్‌ఫారం తొలగించారు. ఈరెండు తొలగించేందుకు రాత్రి వరకూ సమయం పట్టింది. ఇక రాత్రి స్టాప్‌లాగ్‌ను దించేందుకు పనులను ప్రారంబించారు. ఒక వైపు తేలిక పాటి జల్లులు కురుస్తున్నాయి. అయినా ఇంజనీయర్లు ఏమాత్రం పట్టు సడలించుకోకుండా పనులు చేశారు. హోస్టుప్లాట్ ఫారం బరువు 32 టన్నులు ఉండగా, కౌంటర్ వెయిట్ గేటు తూకం 40 టన్నులు ఉంది. ఈ రెండూ కిందకు దించేశారు. నూతనంగా తయారు చేసిన స్టాప్‌లాగ్ ఒక్కొక్కటి 12 నుండి 13 టన్నులు బరువు ఉంటుంది. శుక్రవారం రాత్రి ఎంత సమయం అయినా స్టాప్‌లాక్ బిగించాలనే పట్టుదలతో ఇంజనీయర్లు కృషిచేశారు. ఎట్టకేలకు రాత్రి పదిగంటలకు విజయం సాధించారు. ఫస్ట్ ఎలిమెంట్‌ను దాని స్థానంలోకి చేర్చారు. ఇంకా నాలుగు భాగాలను గేట్ స్థానంలో బిగించాల్సి ఉంది. ఆ దిశగా పనులు సాగుతున్నాయి. సీడబ్ల్యూసీ అధికారులు, ఏపీ, కర్ణాటక మంత్రులు, ముఖ్యమంత్రులు జరుగుతున్న పనుల గురించి ఆరాతీస్తున్నారు. పనులు చేసే సమయంలో ఊహించని ప్రమాదం సంభవిస్తే చికిత్స చేయడం కోసం వైద్యులు, అంబులెన్సులను అక్కడే మొహరించారు.

రావమ్మా! వరలక్ష్మీ మా ఇంటికి..



కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ..



ప్రత్యేకాలంకారంలో తాయమ్మ దేవి

బళ్లారిరూరల్, కంప్లి, సిరుగుప్ప, ఆగస్టు 16: వరమహాలక్ష్మీ వ్రతం వేడుకలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగాయి. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా వెలసిన అన్ని ఆలయాల్లో వరమహాలక్ష్మీ పూజలు నిర్వహించారు. ప్రధానంగా ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మ దేవి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రధాన అర్చకులు అమ్మవారికి పుష్పాలంకార సేవ, ఆకు పూజ నిర్వహించారు. వాసవీమాత, కాళికాంబ, గంగాదేవి ఆలయాల్లో కూడా అమ్మవారి దర్శనంకోసం భక్తులు బారులు తీరారు. బళ్లారి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వరలక్ష్మీ పూజలను పెద్దఎత్తున నిర్వహించుకున్నారు. బళ్లారి ప్రజల ఆరాధ్యదేవత అయిన కనకదుర్గమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే కంప్లిలో ప్రతి ఇంట మహిళలు వారి వారి ఇళ్లల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించుకున్నారు.

అమ్మస్టోర్ వినియోగదారుడికి బంపర్ బహుమానం



లక్కీ డ్రాలో పాల్గొన్న మేయర్ నందీష్‌బాబు, తదితరులు

బళ్లారి సిటీ, ఆగస్టు 16: అమ్మసూపర్ బజార్, అమ్మ స్టోర్స్‌లో గత వందరోజులుగా రూ.2500 అంతకుమించి సరకులు కొన్న వినియోగదారులకు గిఫ్టుకూపన్స్ అందిస్తున్నారు. దీనికి సంబంధించి ఆగస్టు 15వ తేదీ సాయంత్రం బళ్లారి నగర మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, డిప్యూటీ మేయర్ సుకుమ్, కార్పొరేటర్స్ శ్రీనివాస్‌మోత్కార్, రామాంజినేయులు, గోవిందరాజులు సమక్షంలో డ్రా తీశారు. బంపర్ బహుమతి విజేత విశ్వనాథ్‌రెడ్డికి రూ. లక్ష విలువగల డైమండ్ రింగ్ (కూపన్ నంబరు 448కు) ఇచ్చారు. మిగతా రూ.50వేల విలువ గల బహుమతులను 33మంది విజేతలకు అందించారు. ఈ మొత్తం ప్రైజ్ మనీని బళ్లారి కమల జ్యూవెలర్స్, కమల వెడ్డింగ్ మాల్ యజమాని గోల్డ్ శ్రీనివాస్ అందిస్తూ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అమ్మసూపర్‌స్టోర్ యజమాని డేనియల్ మాట్లాడుతూ బళ్లారి ప్రజలు తమను ఇంతగా ఆకర్షించడానికి కారణం వారికి నాణ్యమైన సరకులు అందించడమేనన్నారు. ప్రైజ్ మనీ అందించిన కమల జ్యూవెలర్స్ యజమాని గోల్డ్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీష్‌బాబు. డిప్యూటీ మేయర్ సుకుమ్, మాజీ మేయర్ రాజేశ్వరీ, కార్పొరేటర్లు శ్రీవాస్‌మోత్కార్, రామాంజినేయులు, గోవిందరాజులు, ఫాదర్ ఫ్రాన్సెస్, బళ్లారి కిరణ్ మర్చెంట్, డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షులు ముండ్లూరు నరేష్, అమ్మస్టోర్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు కృషిచేయాలి



నీటి తొట్టెలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బళ్లారి సిటీ, ఆగస్టు 16: బర్రెల తోక పురుగుల మాదిరిగా కనిపించే దోమల లార్వాలను నిర్మూలించేందుకు వారానికోసారి నీటినినింపే పరికరాలను శుభ్రం చేసి డెంగ్యూ నియంత్రణకు ప్రజలు సహకరించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు కోరారు. ఏడీస్ దోమల లార్వా నిర్మూలన దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి శుక్రవారం సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బండిహట్టి షెల్టర్ కాలనీలో సర్వేపనుల్లో పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలలో డ్రమ్ములు, పీపాలు, సిమెంట్ ట్యాంకులు మొదలైన వాటిలో వినియోగానికి నింపే నీటిలో దోమ లార్వా 7రోజులలో దోమగా మారి మనుషలను కుడుతుందన్నారు. వ్యాధిసోకిన దోమ గుడ్లు పెడితే దాని నుంచి వెలువడే దోమలన్నీ డెంగ్యూ వ్యాధిని వ్యాప్తి చేసే సామార్థ్యాన్ని కలిగి ఉంటాయన్నారు. అందువల్ల ప్రజలు వారానికోసారి అన్ని నీటి ఉపకరణాలను ఖాళీ చేసి నీటితో నింపిన తర్వాత దోమల ఉత్పత్తిని నిరోధించడానికి ఒక బట్టను కప్పాలన్నారు.

టెమోపాస్ ద్రావణం వాడాలి

జిల్లా కమ్యూనికబుల్ డీసీజ్ కంట్రోల్ అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇళ్ళు మాత్రమే కాకుండా పాఠశాలలు, అంగన్‌వాడీలు, వాణిజ్య దుకాణాలను తనిఖీ చేయాలని, లార్వా కనిపిస్తే టెమోపాస్ ద్రావణం వేయాలన్నారు. ఇది ప్రధానంగా పగటిపూట కుట్టే దోమ కావడంతో పగటిపూట విశ్రాంతి తీసుకునే పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, ఇతరులు అవసరమైతే నిండుగా దుస్తులు ధరించి దోమతెరలు వాడాలన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైతే మందుల నిల్వలు ఉన్నాయని, కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా జ్వరం ఉన్నట్లు తేలితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. ఈసందర్భంగా ఆశ్రమ కాలనీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కాశీప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, పీహెచ్‌సీఓ దానకుమారి, ఆశావర్కర్ గిరిజ, ఇతర ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేగవంతంగా వంతెన రక్షణ గోడ పనులు



కంప్లి కోట వద్ద వంతెనకు పైపులతో కంచె వేస్తున్న కార్మికులు

కంప్లి, ఆగస్టు 16: తుంగభద్ర నదికి భారీ నీటి ప్రవాహం రావడంతో వంతెనకు ఇరువైపులా రక్షణ ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. జలాశయం 19వ గేటు తెగి నదికి నీరు పోటెత్తడంతో పనులు నిలిచిపోయాయి. నీరు కొంతవరకు తగ్గుముఖం పట్టడంతో మరలా రోడ్డు శాఖ అధికారులు వంతెనకు ఇరువైపులా కంచెను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రోడ్డు శాఖ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ రోడ్డుపై కాలినడక ప్రయాణానికి అనుమతి వచ్చేలోగా వంతెనకు ఇరువైపులా కంచె ఏర్పాటు చేస్తామన్నారు.

వంతెనపై నుంచి దూకి యువకుడి మృతి

సిరుగుప్ప, ఆగస్టు 16 : తుంగభద్ర నదిలో రాజస్థాన్‌కు చెందిన ధన్యారామ్ (20) అనే యువకుడు వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. డీఎస్పీ వెంకటేశులు మాట్లాడుతూ, ఆ యువకుడు పట్టణానికి చెందిన రామ్‌దేవ్ ఆటోమొబైల్ షాపులో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అతడు అకస్మాత్తుగా వంతెనపై నుంచి దూకాడని, నదిలో దూకేందుకు గల కారణాలు తెలియరాలేదన్నారు. ధన్యారామ్ మృతదేహం కోసం పోలీసు శాఖ పడవలతో నదిలో గాలిస్తోందన్నారు. పట్టణానికి చెందిన జైన మతస్తులు తక్షణమే మృతదేహాన్ని వెలికి తీయాలని పోలీసు శాఖను కోరారు.

గాంధీనగర్ సీఐకి సీఎం మెడల్



సిద్ధరామేశ్వర గడగ్

బళ్లారిరూరల్, ఆగస్టు 16 : బళ్లారి నగరం గాంధీనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సిద్ధరామేశ్వర గడగ్ సీఎం మెడల్‌ను అందుకున్నారు. సీయం మెడల్ అందుకున్న నేపథ్యంలో పలువురు పోలీసు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలు, పలుఇళ్లల్లో దొంగతనాలతో పాటు హత్య కేసు నిందితులను ఆయన పట్టుకున్నట్టు తెలుస్తోంది.

అంజనాద్రికి ప్రత్యేక బస్సులు



కంప్లి, ఆగస్టు 16 : ఆంజనేయస్వామి జన్మస్థలమైన అంజనాద్రికి శ్రావణ మాసం సందర్భంగా హోస్పేట నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుస్తాయని అధికారులు తెలిపారు. హోస్పేట, ఉలిగి, శివపుర మీదుగా అంజనాద్రికి బస్సులు చేరుకుంటాయని తెలిపారు.

26 నుంచి కుడితిని పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు

కంప్లి, ఆగస్టు 16 : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు ఈ నెల 5న రిజర్వేషన్ల తేదీలు ఖరారయ్యాయి. అధ్యక్ష స్థానం జనరల్ మహిళకు, ఉపాధ్యక్ష స్థానం ఎస్టీ వర్గానికి ఖరారైంది. ఈ నెల 26న ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. 12.30 నుంచి ఒంటి గంట వరకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 1.30 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం 2 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు.

పాముకాటుకు రైతు మృతి

కంప్లి, ఆగస్టు 16 : కంప్లికి చెందిన మరాఠి క్రిష్టప్ప (50) పాముకాటుతో మృతి చెందాడు. శుక్రవారం ఉదయం మరాఠి క్రిష్టప్ప పొలం పనుల్లో నిమగ్నమైవుండగా పొదల్లో వున్న పాముపై కాలు పెట్టడంతో అది కాటు వేసింది. వెంటనే అక్కడి రైతులకు తెలియజేయగా వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే ఆయన మృతి చెందారు. ఉన్నపళంగా పొలానికి వెళ్లిన రైతు ఇలా పాముకాటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. కంప్లి పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు కేసు నమోదైంది.

కళాకారులకు అవకాశాలు లేకుండా చేయొద్దు



మాట్లాడుతున్న కళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకరబండె

బళ్లారి సిటీ, ఆగస్టు 16: తోటి కళాకారులపై. కన్నడ సాంస్కృతిక శాఖ అధికారులపై అభినయ కళాకేంద్రం అధ్యక్షుడు జగదీశ్ ఒత్తిడి పెంచి తన పలుకుబడితో నిజమైన కళాకారులకు అవకాశాలు లేకుండా చేస్తున్నాడని జిల్లాకళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకరబండె, బయలాట మాస్టర్ ముద్దనూరు పంపాపతి ఆరోపించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ జగదీశ్ ఒక బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగిగా నాటకాలను ప్రదర్శిస్తూ ప్రభుత్వం నుంచి నిధులను పొందుతుండటం సరికాదని, ఇది ఒకరకంగా పేద కళాకారులను వంచించినట్లేనని అన్నారు. నాటక కళాకారులు వాక్చాతుర్యం కలిగి ఉండాలని, అయితే జగదీశ్ రికార్డింగ్ పాటలు వేసి కళాప్రతిభను నాశనం చేస్తున్నారన్నారు. ఆయన మాట వినని అధికారులపై ఉన్నతాధికారులకు లేనిపోనీ చాడీలు చెప్పడం ఆయన వృత్తిగా మారిందన్నారు.

హోసూరు జోన్

ఇంటింటా వైభవంగా వరలక్ష్మీవ్రతం



పూజలందుకున్న వరమహాలక్ష్మి

హోసూరు, ఆగస్టు 16: హోసూరు నగర వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మి పండుగను ఘనంగా నిర్వహించారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు వరలక్ష్మి పండుగను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ముత్తైదువులు ఇంటింటికి వెళ్లి వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ పూజలు చేశారు. వరలక్ష్మి అమ్మవారి కృప అందరికి దక్కాలని ఉపవాసాలు ఉంటూ శ్రద్ధ భక్తిలతో నోములు చేశారు. పూజల కోసం రకరకాల పండ్లు, పూలు కొనుగోలు చేసి నైవేద్యంగా సమర్పించారు.

హోసూరు పూల మార్కెట్‌లో తరగని రద్దీ

హోసూరు, ఆగస్టు 16: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పూల మార్కెట్‌లో వరమహాలక్ష్మీ వ్రతం కోసం పూలు కొనుగోలుచేసేందుకు గురువారం ప్రజలు గుమిగుడారు. అలాగే హోసూరు నగరంలో వందకు పైగా పూల దుకాణాలు నిర్వహిస్తుండగా, రైతులు నేరుగా విక్రయించడంతో నగరమంతటా సందడి నెలకొంది. వరమహాలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని తమిళనాడు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యల్లో మహిళలు, పురుషులు గురువారం, శుక్రవారం పూలను కొనుగోలు చేశారు. గురువారం పూల ధర మల్లెపూలు కిలో రూ.3వేలు పలికింది.

19నుంచి పారిశ్రామిక రుణమేళా

హోసూరు(కృష్ణగిరి), ఆగస్టు 16: ప్రభుత్వరంగ సంస్థ ది తమిళనాడు ఇండస్ట్రియల్ ఇన్వేస్టిమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఐఐసీ) ఆధ్వర్యంలో ఈనెల 19నుంచి ప్రత్యేక పారిశ్రామిక రుణమేళాజరగనుంది. 1949లో ఏర్పాటైన ఈ కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో లెక్కలేనన్ని పరిశ్రమలకు రుణాలు అందించి పారిశ్రామికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిచింది. కొత్త కర్మాగారాలు సేవా స్థాపనలు, ఇప్పటికే ఉన్న యూనిట్ల విస్తరణ, ఉత్పత్తిని పెంచడం కోసం వివిధ పథకాల క్రింద సూక్ష్మ చిన్న మధ్యతరహ పరిశ్రమలు సేవల రంగాలకు కార్పొరేషన్ రుణాలను అందించింది.. హోసూరు బ్రాంచ్ ఆఫీస్ వద్ద ప్లాట్ నెంబర్ 308-309 ఈ సిప్‌కాట్ ఇండస్ట్రీయల్ కాంప్లెక్స్ లాల్ కంపెనీ ఎదురుగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద, ప్రత్యేక పారిశ్రామిక రుణమేళా జరగనుంది. టిఐఐసీ వివిధ పథకాల ప్రత్యేక లక్షణాలను బట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు, వడ్డీ రాయితీ 3 శాతం, ఇతర రాయితీల కొత్త ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ స్కీమ్, అన్నల్ అంబేద్కర్ బిజినెస్ ఛాంపీయన్ స్కీమ్ మొదలైన వాటికి రుణాలు ఇవ్వనున్నారు. తమిళనాడు ప్రభుత్వం రూ.75 లక్షల వరకు 25 శాతం, 35 శాతం పెట్టుబడి రాయితీతో యంత్రాల మదింపుపై అర్హత కలిగిన పరిశ్రమలకు రుణం అందిస్తుంది. ఈ క్యాంపు వ్యవధిలో సమర్పించిన పబ్లిక్ లోన్ దరఖాస్తులకు పరీక్ష రుసుముపై 50 శాతం రాయితీ ఇస్తారు. కొత్త పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు వ్యాపార ప్రణాళికలతో రావడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యాపార రుణం మంజూరు సేవలను ఉపయోగించుకోవాలని అధికారులు ప్రకటనలో తెలిపారు.



పూల మార్కెట్‌లో గురువారం విక్రయాలు ఇలా...

రాయచూరు తాగునీటి సమస్యపై విస్తృత చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి సతీశ్

రాయచూరు, ఆగస్టు 16 : నగరంలో నిత్యం ఎదురవుతున్న తాగునీటి సమస్యపై శుక్రవారం నగరసభ సుదీర్ఘ చర్చ జరిపింది. గడచిన ఏడాదిన్నర కాలంగా జిల్లాధికారి నేతృత్వంలో ప్రత్యేక అధికారి పాలనలో సాగుతున్న నగరసభ శుక్రవారం సుదీర్ఘ విరామం తర్వాత సమావేశమైంది. జిల్లాధికారి సతీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని పార్టీలకు చెందిన నగరసభ సభ్యులు, అధికారులు పాల్గొని వివిధ సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ముఖ్యంగా రెండు జీవనదులు ఆనుకుని ప్రవహిస్తున్న నగరంలో తాగునీటి ఎద్దడి నెలకొనడాన్ని అన్ని పార్టీల సభ్యులు తీవ్రంగా నిరశించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వసంత్‌కుమార్ మాట్లాడుతూ నగరానికి ప్రతి రోజు 40 ఎంఎల్‌డీ నీటి సరపరా జరుగుతున్నా ఇందులో సగ భాగం పారిశ్రామిక వాడలకు తరలించడం సబబా అని ఆక్షేపించారు. శుద్ధి చేసిన తాగునీటిని పారిశ్రామిక వాడలకు అందించడాన్ని ఎమ్మెల్సీ తప్పుబట్టారు. దీని పై వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలని పారిశ్రామిక వాడలకు రా వాటర్ మాత్రమే అందించాలన్నారు. నగరసభ సీనియర్ సభ్యుడు జయణ్ణ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లే తాగునీటి సమస్య తలెత్తిందంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం సాంకేతిక సమస్య అని చెప్పడంతోనే అధికారులు కాలం వెళ్లదీస్తున్నారని సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదన్నారు. అదే సమయంలో జోక్యం చేసుకున్న మరికొందరు సీనియర్ సభ్యులు దరూర్ బసవరాజు, శివరాజ్ తదితరులు మూడు రోజులకొకసారి తాగు నీరందించడాన్ని ప్రజలు తీవ్రంగా నిరశిస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాయచూరు, ఆగస్టు 16: రాయచూరు తాలూకా ఎలెబిచ్చాలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న 21 ఏళ్ల యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం యరగేరా పోలీసులు కేసు నమోదుచేశారు. ఐరన్ రాడ్స్‌తో వెళుతున్న ట్రాక్టర్ బైక్‌పై వెళుతున్న యువకుడిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతి చెందిన యువకుడిని బి.హనుమాపూర్‌కు చెందిన చంద్రశేఖర్‌గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ ఆ ట్రాక్టర్‌ను పొలాల్లోకి తీసుకెళ్లి దాచిపెట్టి తాను పరారయ్యాడు. విషయాన్ని స్థానికులు గుర్తించి డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాగా చంద్రశేఖర్ ఇటీవలే పాలిటెక్నిక్ డిప్లమా పూర్తిచేసి సీఈటీ కోసం ప్రిపేర్ అవుతున్నట్లు పోలీసులు తెలిపారు. అతడు రాయచూరు నుంచి స్వంతఊరు హనుమాపూర్‌కు వెళుతున్న సందర్భంగా ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించిన పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నైపాల్ (జయంతి)



నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత, 'సర్ విద్యాధర్ సూరజ్ ప్రసాద్ నైపాల్ 1932 ఆగస్టు 17న జన్మించారు. గొప్ప నవలా రచయిత. 2001లో 'నోబెల్ ప్రైజ్' అందుకున్నారు. వీఎస్ నైపాల్ అని, విడియా నైపాల్ అని పిలుస్తారు. ట్రినిడాడ్ టొబాగో దేశం చాగువానాలో జన్మించిన బ్రిటీష్ రచయిత. 50ఏళ్లలో 30కుపైగా పుస్తకాలు ప్రచురించారు. ఆయన రచనలకు తొలి పాఠకురాలు, ఎడిటరూ, విమర్శకురాలు భార్య ప్యాట్రిసియా అన్నే హెల్. 'ఇన్ ఏ ఫ్రీ స్టేట్' రచనకు 1971లో బుకర్ ప్రైజ్ అందుకున్నారు. 1983, 89లలో జెరూసలెం ప్రైజ్, 1990లో 'నైట్‌హుడ్ ఇన్ బ్రిటన్' తదితర పురస్కారాలు అందుకున్నారు. 2018 ఆగస్టు 11న కన్నుమూశారు.

కొడవటిగంటి (వర్ధంతి)



'కొకు'గా పేరొందిన తెలుగు రచయిత కొడవటిగంటి కుటుంబ రావు 1909 అక్టోబరు 28న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. 'చందమామ' మాస పత్రిక అత్యున్నత స్థితి రావడానికి ఎంతో కృషి చేశారు. హేతువాదిగా ముద్రపడ్డారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే 'బుద్ధికొలత వాదం' ను ప్రతిపాదించారు. తన 50ఏళ్ల రచనా జీవితంలో 10వేల పేజీలకుపైగా రచనలు చేశారు. సమకాలీన మానవ జీవితాన్ని పరామర్శించి, విమర్శించి సుసంపన్నం చేసేదే సరైన సాహిత్యంగా ఆయన భావించారు. 1980 ఆగస్టు 17న కన్నుమూశారు.

భువనచంద్ర (పుట్టినరోజు)



సినీ గేయరచయితగా పేరొందిన భువనచంద్ర 1949 ఆగస్టు 17న కృష్ణా జిల్లాలో నూజివీడు ప్రాంతం గుళ్ళపూడి ప్రాంతంలో జన్మించారు. ఎయిర్‌ఫోర్స్‌లో 18 ఏళ్ల పాటు సర్వీసు అందించి వలంటరీ రిటైర్మెంట్ తీసుకుని సాహిత్యంపై మక్కువతో సినీ పాటలు రాస్తున్నారు. 1971లో ఇండో-పాకిస్థాన్ యుద్ధం లో పాల్గొని 4 మెడల్స్ అందుకున్నారు. 2వేలకుపైగా పాటలు రాశారు. వందకుపైగా కథలు, నవలలు, మ్యాగజైన్‌లకు రచనలు చేశారు. కొన్ని రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 'వెల్‌కమ్ ఒబామా' సినిమాలో నటించా రు. కళాసాగర్ అవార్డు, వంశీ అవా ర్డు, కొవ్వాలి శత జయంతి అవార్డు, సముద్రాల అవార్డు, వేటూరి సాహిత్య పురస్కారం తదితర పురస్కారాలు అందుకున్నారు.

థియర్రీ హెన్రీ (పుట్టినరోజు)



ఫ్రెంచ్ దేశ ఫుట్‌బాల్ క్రీడా కారుడు థియర్రీ డేనియెల్ హెన్రీ 1977 ఆగస్టు 17న జన్మించారు. ఫ్రాన్స్ దేశ చరిత్రలో అంత ర్జాతీయ స్థాయిలో ఎక్కువ గోల్స్ సాధించారు. ప్రీమియర్ లీగ్ ఆల్‌టైం గ్రేటెస్ట్ స్ట్రైకర్‌గా పేరొందారు. 2003, 2004లో 'ఫిఫా వరల్డ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌లో రన్నరప్‌గా నిలిచారు. 1998 ఫిఫా వరల్డ్ కప్, యూఈఎఫ్ఏ యూరో 2000, 2003 ఫిఫా కన్ఫెడరేషన్స్ కప్ తదితర విజయాలు సాధించారు. 'ఫ్రెంచ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయ ర్‌'ను ఐదుసార్లు పొందారు. 'ప్రీమియర్ లీగ్ హాల్ ఆఫ్ ఫేం 2021'లో తొలి ఇద్దరు క్రీడాకారులలో ఒకరు.

ఆలంబగిరిపై సామూహిక వరలక్ష్మీవ్రతం







బాగేపల్లిలో లక్ష్మీదేవికి అలంకరణ, శిడ్లఘట్ట తాలూకాలో వేర్వేరు చోట్ల అలంకరణ



బెంగళూరు నగరంలో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న మహిళలు





చేళూరులోని ఓ నివాసంలో పూజలు, బెంగళూరు నగరంలో ఓ నివాసంలో అలంకరణ





విజయపురలో అలంకరణ ఇలా..

చింతామణి, ఆగస్టు 16: తాలూకాలోని ప్రసిద్ధ ఆలంబగిరి క్షేత్రం కల్కి లక్ష్మీ వెంకటరమణస్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం వరమహాలక్ష్మి సామూహిక వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనేలా వీలు కల్పించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు. ప్రతి ముత్తైదువుకు పూజా సామగ్రిని యోగి నారేయణ మఠం సమకూర్చింది. సర్వాలంకృత పీఠంపై లక్ష్మీఅమ్మవారిని కొలువుదీర్చగా అర్చకబృందం లక్ష్మీ అష్టోత్తరాన్ని పఠిస్తుండగా భక్తులు కూర్చున్నచోటే కుంకుమార్చన నిర్వహించారు. విశ్వక్సేన పూజ, కళశారాధన, పీఠపూజ, ద్వారపాలకపూజ, ప్రాణప్రతిష్ఠ, లక్ష్మీత్య అష్టోత్తర శత నామావళి పూజ, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అష్టావధాన సేవ అనంతరం మహామంగళారతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కైవార యోగినారేయణమఠం ఉపాధ్యక్షుడు జె.విభాకరరెడ్డి, సంకీర్తనా ప్రాజెక్టు సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతర్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

చేళూరు తాలూకాలో...

చేళూరు: పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా వరమహాలక్ష్మి పూజలు సాగాయి. ప్రజలు ఇంటింటా సహా మరికొన్ని చోట్ల ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు. అమ్మవారిని ఇలా ఆరాధించడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. విశేషపూజల అనంతరం ప్రసాదాలు, వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. బంధుమిత్రులతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: శ్రావణమాసంలో వచ్చే పండుగలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనేవాటిలో వరమహాలక్ష్మి వ్రతం ఒకటి. తాలూకావ్యాప్తంగా గ్రామాలలో సైతం మహిళలు, పిల్లలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించి పూలు, పండ్లతో అలంకరించారు. ఓళిగ, కుడుములు ఇతరత్రా నైవేద్యంగా సమ ర్పించారు. నూతనవస్త్రాలు ధరించి ఉత్సా హంగా గడిపారు. ముత్తైదువులకు పసుపు కుంకుమలు అందచేశారు.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: పట్టణ, తాలూకా వ్యాప్తంగా వరమహాలక్ష్మి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లను స్వచ్ఛపరిచి రంగవల్లులు వేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూలతో అలంకరించారు. వివిధ రకాల పదార్థాలను సిద్ధం చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. లోక కల్యాణార్థం ప్రార్థనలు చేశారు. ఎటు చూసినా పండుగ వాతావరణం నెలకొంది.

విజయపురలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి లో ఎటుచూసినా సందడి వాతావరణం నెలకొంది. వర మహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ప్రజలు శుక్రవారం అర్చనతో ఆచరిం చారు. పిల్లలు, పెద్దలు నూతనవస్త్రాలు ధరించి పూజా కార్య క్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఇంటింటా అమ్మవారిని కొలువు దీర్చి విశేషపూజలు చేసి శక్తికొలదీ పండ్లు, ఇతర పదార్థాలు నైవేద్యాలు సమర్పించారు. పలు రకాల పుష్పాలు, కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. పట్టణంలో ఎటు చూసినా సందడి నెలకొంది.

దేశం కోసం యువత పాటుపడాలి

▸▸ డిప్యూటీ కమాండెంట్ శిరీశ్‌కుమార్ రాయ్



శిరీశ్‌కుమార్ రాయ్‌కు పుష్పగుచ్ఛం అందజేత

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం యువత పాటుపడాలని ఆర్ఏఎఫ్ 97వ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ శిరీశ్‌కుమార్ రాయ్ అభిప్రాయపడ్డారు. శివమొగ్గలోని రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యులుగా పాల్గొన్నారు. యూనివర్సిటీ డైరెక్టర్ రమానంద్ గార్గ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శిరీశ్‌కుమార్ రాయ్ మాట్లాడుతూ 'వికసిత భారత్' లక్ష్యం మరికొన్నేళ్లలో ప్రపంచంలోనే భారత్ అగ్రగామి కావాలన్నది ఆశయమన్నారు. ఆ దిశగా యువత పాటుపడాలన్నారు. సాంస్కృతిక, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభా ముఖ్యులుగా పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు సింధు, నందతోపాటు డొనాల్డ్ బెన్నీ పర్యవేక్షించారు.

ఇద్దరికి బ్రాండ్ భారత్ పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న న్యాయవాది ప్రదీప్‌రాయ్, పారిశ్రామికవేత్త రాజీవ్‌జునేజా

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ సదస్సు 2024లో కర్ణాటకకు చెందిన ప్రముఖ న్యాయ వాది ప్రదీప్‌రాయ్, పారిశ్రామికవేత్త రాజీవ్ జునేజాలకు బ్రాండ్ భారత్ పురస్కారాలు దక్కాయి. ఢిల్లీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ పురస్కారాన్ని ప్రదానం చేశారని ప్రదీప్ రాయ్ ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ విభాగాలలో రాణించిన ప్రముఖులకు పురస్కారాలు అందించారన్నారు. బ్రాండ్ భారత్ పురస్కారం దక్కడం గౌరవంగా ఉందన్నారు.

జోయ్ అలుక్కాస్‌లో వజ్రాభరణాల ప్రదర్శన



నగల ప్రదర్శనలో కన్యకా పరమేశ్వర్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్‌లో నగర వాసులకోసం జోయ్ అలుక్కాస్‌లో వజ్రాభరణాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. హోం మంత్రి పరమేశ్వర్ భార్య కన్యకా పరమేశ్వర్ ప్రదర్శనలను లాంఛనంగా ప్రారంభించారు. సంప్రదాయ, ఆధునిక డిజైన్ల వజ్రాభరణాలు, వజ్రాలు ప్రదర్శనలో ఉంటాయని సంస్థ ముఖ్యులు తెలిపారు. అన్‌కట్ వజ్రాలు, అపురూపమైన డిజైన్లు సాధ్యమన్నారు. లక్ష రూపాయల కంటే ఎక్కువ విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తే ఒక గ్రాము బంగారునాణెం బహుమతిగా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వర్ మాట్లాడుతూ సంప్రదాయశైలి వజ్రాభరణాల ప్రదర్శనలు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. సెప్టెంబరు 1వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పదో తర గతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు తెలుగు విద్యార్థులకు సేవాభారత్ ట్రస్టు తరపున ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. వివేక్‌నగర్ హైస్కూల్‌లో ఇటీవల ఎస్ఎస్ఎల్‌సీలో ఎక్కువ మార్కులు సాధించిన ప్రవీణ్ (500), భరత్ (475), అంజలి (430)లను ప్రత్యేకంగా అభినందించారు. ప్రవీణ్‌కు రూ.5వేలు, మిగిలిన ఇద్దరికీ రూ.4వేలు చొప్పున నగదు బహుమతి ఇచ్చినట్టు సేవా భారత్ ట్రస్టు అధ్యక్షుడు బండి ఆదినారాయణరెడ్డి తెలిపారు.

లాన్‌ఎక్సెస్‌కు అంతర్జాతీయ పురస్కారాలు



పురస్కారాలతో సంస్థ ముఖ్యులు

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): లాన్‌ఎక్సెస్ కంపెనీకి రెండు అంతర్జాతీయ పురస్కారాలు దక్కడం సంతోషంగా ఉందని బెంగళూరు ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎనర్జీ ఫౌండేషన్ ద్వారా ప్లాటినమ్ విభాగంలో గ్లోబల్ సేఫ్టీ పురస్కారాన్ని, సుదీర్ఘకాలం నిల్వ ఉండేలాంటి జల నిర్వహణ విభాగంలో గ్లోబల్ వాటర్‌టెక్ పురస్కారం దక్కినట్టు సంస్థ ఛైర్మన్ నమితేశ్ రాయ్‌చౌదరి సంతోషం వ్యక్తం చేశారు. కేవలం మా సంస్థకు మాత్రమే దక్కిన గౌరవం కాదని, మా సేవలు పొందే విభాగాలకు దక్కిన గుర్తింపు అన్నారు. గ్లోబల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఫౌండేషన్, సురక్షత, ఆరోగ్యభద్రత నిర్వహణ, వ్యర్థపునీరు శుద్ధీకరణ వంటి రంగాలకు ప్రాధానత ఇచ్చిందన్నారు. రీట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ద్వారా ఎక్కువనీటిని పునఃవినియోగం సాధ్యమన్నారు. ఈ మేరకు ఉత్తమ పురస్కారాలను మా శ్రేయోభిలాషులకు అంకితమన్నారు.

ఫాక్స్‌కాన్‌కు సంపూర్ణ సహకారం

సీఈఓ, ఛైర్మన్ యంగ్ లియుతో సీఎం చర్చలు



ఫాక్స్‌కాన్ సీఈఓతో సీఎం, డీసీఎం

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తైవాన్ దేశానికి చెందిన యాపిల్ ఫోన్ సంస్థ ఫాక్స్‌కాన్‌కు రాష్ట్రంలో అన్ని విధాలా సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య భరోసా ఇచ్చారు. బెంగళూరు పర్యటనకు వచ్చిన ఫాక్స్‌కాన్ సీఈఓ, ఛైర్మన్ యంగ్ లియుతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. యంగ్ లియు బెంగళూరులోని హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగా భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్, ఐటీ బీటీశాఖ మంత్రి ప్రియాంక ఖర్గే సాదరంగా స్వాగతించారు. శుక్రవారం రాత్రి వసంతనగర్‌లోని ఓ హోటల్‌లో సీఎం, యంగ్‌లియు చర్చలు జరిపారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో కంపెనీ ఏర్పాటు చేసినా, విస్తరించినా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సాంస్కృతిక పరంగా ఉన్నతమైన విలువలను పాటిస్తున్న రాష్ట్ర పారిశ్రామిక విభాగం అన్ని సౌలభ్యాలు కల్పిస్తుందని తెలిపారు. శాంతిభద్రతలు ఉత్తమంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా ట్రాక్టర్‌కు బస్సు ఢీ

▸▸ తండ్రికి గాయాలు... కుమారుడు మృతి



ఘటనాస్థలంలో వాహనాలు ఇలా...



భార్గవ్ (ఫైల్)

చింతామణి, ఆగస్టు 16: చింతామణి - బెంగళూరు రాష్ట్ర రహదారిపై చన్నసంద్ర సమీపాన భారత్ పెట్రోల్‌బంకు వద్ద టమోటా లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేట్ బస్సు ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న నెర్నకల్ గ్రామానికి చెందిన 50ఏళ్ల అశ్వథప్ప గాయపడగా కుమారుడు భార్గవ్ (17) అక్కడికక్కడే మృతి చెందాడు. తాలూకాలోని హీరేకట్టిగేనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని నెర్నకల్‌కు చెందిన అశ్వత్థప్ప, కొడుకు భార్గవ్‌లు టమోటా క్రేట్‌లతో ట్రాక్టర్‌లో బయల్దేరారు. చింతా మణి ఏపీఎంసీ మార్కెట్‌కు వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున సుమారు 5 గంటలకు బెంగళూరు నుంచి చింతామణి వైపు వస్తున్న బస్సు ఢీ కొంది. కోలారు తాలూకా నరసాపుర ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన ప్రైవేట్ బస్సుగా గుర్తించారు. బస్సు అతివేగంగా రావడంతో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ వేరయ్యాయి. సుమారు 20మీటర్ల దూరం వరకు బస్సు ట్రాక్టర్‌ను తోసుకెళ్లింది. ట్రాక్టర్ నడుపుతున్న అశ్వథప్ప గాయాలతో బయటపడగా ప్రమాద దాటికి కిందపడిన భార్గవ్‌పై టమోటా క్రేట్‌లు, ట్రాలీ పడ్డంతో అతను మృ త్యువాత చెందాడు. అతను ఐటిఐ చదువుతు న్నట్టు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ అక్కడనుంచి పరారీ అయ్యా డు. సమాచారం అందు కున్న ఏఎస్ఐ వెంకటరెడ్డి వెంటనే ఘటనాస్థలానికి చేరు కున్నా డు. గాయపడిన అశ్వథప్పను, భార్గవ్ మృతదేహాన్ని చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా టమోటా క్రేట్‌లో రోడ్డుపై పడ్డంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోక్లైనర్ సాయంతో పరిస్థితిని చక్కదిద్దారు. అశ్వథప్ప ఫిర్యాదు మేరకు చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై కృతజ్ఞత యాత్ర

హిందూపురం అర్బన్, ఆగస్టు 16: తెలుగుదేశం పార్టీ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పెరుపోగు వెంకటేశ్వర రావు.. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఏపీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామంజినప్ప, కార్యదర్శి మద్దిలేటి ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు కృతజ్ఞతా యత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు ఉద్యోగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. మాజీ సీఎం జగన్ హయాంలో మాదిగల అభివృద్ధి కుంటిపడింద న్నా రు. కార్యక్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటి మద్ది మం ద ఓబుళేశు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, బహుజన చైతన్య వేదిక అధక్షుడు శివరామ్‌కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిశెట్టి, రాచేపల్లి రామాంజి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ రూరల్, ఆగస్టు 16: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జాబ్ కోఆర్డినేటర్ లక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని పంగల్ రోడ్డులోని టీటీడీసీలో ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణాకాలంలో ఉచిత భోజనం, సదుపాయాలు కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కోర్సుల్లో ప్రాజెక్ట్ మేనేజర్ 5జీ నెట్‌వర్కింగ్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించే సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. 18ఏళ్ల నుంచి 26 సంవత్సరాల యువతీయువకులు అర్హులన్నారు. వివరాలకు 7989479371 నంబరులో సంప్రదించాలన్నారు.

సబ్సిడీపై విత్తన రాగులు మంజూరు

గోరంట్ల, ఆగస్టు 16: మండలంలోని రైతుల సౌకర్యార్థం వేగవంతి రకానికి చెందిన పది టన్నుల విత్తన రాగులు మంజూరైనట్లు ఏఓ మునికృష్ణ తెలిపారు. నాలుగు కిలోల రాగుల బ్యాగును 40శాతం సబ్సిడీతో రూ.144 చెల్లించి రైతులు పొందవచ్చన్నారు. మండలంలోని ఆర్బీకేల ద్వారా కిలో రాగులు రూ.37వంతున విక్రయిస్తున్నట్లు చెప్పారు. నీటి ఆధారమున్నరైతులు పైరు పోసుకుని నాటితే ఎకరాకు రెండు కిలోలు అవసరమన్నారు. అయితే ఎకరాకు నాలుగుకిలోల రాగులు పొలంలో నేగా విత్తాల్సి ఉంటుందన్నారు.

వర్షంతో అంతరాయం



జయనగర్ ఈస్ట్ ఎండ్‌లో జలమయమైన రహదారి ఇలా

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. జయనగర్, మెజస్టిక్, హెబ్బాళ్ తదితర చుట్టుపక్కల ప్రాంతాలు జలమయం కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంచారానికి అంతరాయం నెలకొంది. ఇటీవల కురిసిన వర్షంతో జయదేవ ఆసుపత్రి అండర్‌పాస్ జలమయం కాగా తాజాగా కురిసిన వర్షంతో జయనగర్ ఈస్ట్ ఎండ్ చుట్టుపక్కల ప్రాంతాలు చెరువులను తలపించాయి.

పగటిపూట బ్లాస్టింగ్‌పై స్థానికుల ఆగ్రహం



పగలే బ్లాస్టింగ్ చేస్తున్న దృశ్యం

లేపాక్షి, ఆగస్టు 16: పగటిపూట కొండల్లో బ్లాస్టింగ్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బయన్నపల్లి సమీపంలోని గుట్టలో ఏర్పాటు చేసిన కంకర మిషన్ క్వారీ వద్ద ఇటీవల బ్లాస్టింగ్‌లు అధికంగా జరుగుతున్నాయనీ, వాటిని నిలిపివేయాలని బయన్నపల్లి, మామిడిమాకులపల్లి, బసవనపల్లి వాసులు డిమాండ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో బ్లాస్టింగ్ జరపకుండా పగలే చేయడంతో అడవిలోకి వెళ్లిన పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని వారు వాపోతున్నారు. పశువులను మేతకోసం తీసుకెళ్లాలంటే ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర కోసం కెమికల్స్‌ను అధికంగా వాడుతున్నారని, దాని వాసనవల్ల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. ఇటీవల బ్లాస్టింగ్‌కు ఉపయోగించిన కెమికల్స్ వాసనతో చుట్టుపక్కల పిల్లలు అస్వస్థతకు లోనవుతున్నారన్నారు. మూడు గ్రామాల ప్రజలు గతంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రజల ప్రాణాలకన్నా అధికారులకు మామూళ్లే ముఖ్యమని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్ల శబ్దానికి ఇళ్ల గోడలు నెర్రలు చీలి ఎప్పుడు కూలుతాయోనని భయభ్రాంతుల్లో జీవిస్తున్నామన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. కంకర క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.